గృహ యోగం

- సాకారమవుతున్న పేదవారి సొంతింటి కల
- చల్లపల్లిలో శరవేగంగా గృహ నిర్మాణాలు
- ఇప్పటికే 165 గృహాల నిర్మాణం పూర్తి
- వివిధ దశల్లో 572 గృహాలు

చల్లపల్లి: పేదల సొంతింటి కల త్వరలో సాకారం కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల పేరుతో అర్హులైన పేదలకు స్థలాలు ఇచ్చారు. లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహాన్ని, తమ పొదుపు సొమ్మును, డ్వాక్రా రుణాలను జోడించి చల్లపల్లిలో పక్కా గృహాలు నిర్మించుకుంటున్నారు. చల్లపల్లిలో నారాయణరావు నగర్ కాలనీ పక్కన చల్లపల్లి-విజయవాడ ప్రధాన రహదారిని ఆనుకుని రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన అత్యంత ఖరీదైన ఇళ్ల స్థలాల్లో గృహ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

నాలుగు లే అవుట్లలో 865 నివేశన స్థలాలు..

రాష్ట్ర ప్రభుత్వం చల్లపల్లిలో మొత్తం నాలుగు లే అవుట్లలో పేదలకు 865 నివేశన స్థలాలు మంజూరు చేసింది. అన్ని ప్లాట్లను ప్రభుత్వం పూర్తి స్థాయిలో మెరక చేసి లబ్ధిదారులకు అప్పగించింది. ఈ నాలుగు లే అవుట్ల లెవలింగ్ పనులకు ప్రతిపక్షాలు అనేక ఆటంకాలు సృష్టించినా అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు లబ్ధిదారులకు అండగా నిలిచి వారికి అవసరమైన లెవలింగ్ పనులు నూరు శాతం పూర్తి చేయడంలో ప్రత్యేక చొరవ చూపించారు. దాదాపు నియోజకవర్గంలో అతి పెద్ద జగనన్న కాలనీగా ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు ఈ కాలనీని ప్రతిష్టాత్మకంగా తీసుకుని అభివృద్ధి చేశారు.

రూ.కోటీ 37 లక్షలతో విద్యుదీకరణ..



నిర్మాణంలో ఉన్న గృహాలు (ఇన్‌సెట్) విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి (ఫైల్)



నాలుగు లే అవుట్లలో రూ.కోటీ 37 లక్షలతో పూర్తి స్థాయి విద్యుదీకరణ పనులను ఎమ్మెల్యే చొరవతో ఇప్పటికే పూర్తి చేశారు. 250 విద్యుత్ స్తంభాలు, నూతన విద్యుత్ లైన్లు, తగిన సామర్థ్యం మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కాలనీలో చిట్ట చివరి ప్లాట్‌కు కూడా విద్యుత్ సరఫరా చేసేలా స్తంభాలు, విద్యుత్ లైన్ల ఏర్పాటు పూర్తి చేశారు.

165 గృహాల నిర్మాణం పూర్తి..

చల్లపల్లిలోని జగనన్న కాలనీలో ఇప్పటికే 165 పక్కా గృహాల నిర్మాణం పూర్తయింది. మొదటి లేఅవుట్‌లో 129 ప్లాట్లు కేటాయించగా 43 గృహాల నిర్మాణం పూర్తయింది. 103 గృహాల నిర్మాణం జరుగుతోంది. రెండో లేఅవుట్‌లో 204 ప్లాట్లు కేటాయించగా 44 గృహాల నిర్మాణం పూర్తయింది. 135 గృహాల నిర్మాణం జరుగుతోంది. మూడవ లేఅవుట్‌లో 236 ప్లాట్లు కేటాయించగా 18 గృహాల నిర్మాణం పూర్తయింది.

122 గృహాల నిర్మాణం జరుగుతోంది. నాలుగో లేఅవుట్‌లో 306 ప్లాట్లు కేటాయించగా 60 గృహాల నిర్మాణం పూర్తి కాగా, 212 గృహాల నిర్మాణం జరుగుతోంది. మొత్తం మీద చల్లపల్లి జగనన్న కాలనీలో ఇప్పటికే 165 గృహాల నిర్మాణం పూర్తి కాగా, 572 గృహాల నిర్మాణం జరుగుతోంది. తద్వారా 80 శాతానికి పైగా గృహాల నిర్మాణం పూర్తి కానున్న కాలనీగా ఈ కాలనీ నిలువనుంది.

లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులను ప్రతినిత్యం ప్రోత్సహిస్తూ ఎప్పటికప్పుడు వారికి గృహ నిర్మాణ శాఖ సహకారం అందిస్తున్నాం. మెటీరియల్, ఇసుక సకాలంలో అందిస్తూ పేద వారు తమ సొంతింటి కల నెరవేర్చుకునే దిశగా వారిని వెన్నంటి ముందుకు నడిపిస్తున్నాం.

– ఎం.అరుణకుమారి, హౌసింగ్ ఏఈ

పన్ను వేయని ఇళ్లను, స్థలాలను గుర్తించండి

మున్సిపల్ కమిషనర్ అంజయ్య



మాట్లాడుతున్న కమిషనర్ అంజయ్య

పెడన: శాశ్వత భూ హక్కు..భూ చట్టం పథకంలో భాగంగా టౌన్‌ప్లానింగ్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు కేవలం పన్నులు వేసిన ఇళ్లను, ఖాళీ స్థలాలను మాత్రమే సర్వే చేశారని, ఇప్పటి నుంచి పన్నులు వేయని ఇళ్లను, ఖాళీ స్థలాలను సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య ఆదేశించారు. బుధవారం తన చాంబరులో వార్డు సచివాలయాలకు చెందిన అడ్మిన్లు, ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశమయ్యారు. పన్నులు వేస్తున్నవి 7,800 వరకు ఇళ్లను, ఖాళీ స్థలాలను గుర్తించామని కమిషనర్ తెలిపారు. 16ఏఏ ప్రకారం పన్నులు వేయని వాటిని కూడా తక్షణం సర్వే చేసి వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచి పన్నులు కూడా వేయాలని రెవెన్యూ సిబ్బందిని కూడా కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో టీపీఓ ఏసుబాబు, ఆర్ఐ వెంకటేశ్వరరావు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వామివారి సేవలో అవనిగడ్డ నూతన డీఎస్పీ



మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని అవనిగడ్డ నూతన డీఎస్పీ మురళీధర్ బుధవారం దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి చేరిన ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకుడు మణిదీప్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందించారు. చల్లపల్లి సీఐ రవికుమార్, స్థానిక ఎస్ఐ పద్మ, పోలీస్ అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వాసవీ మాత జయంత్యుత్సవాలు



పెడన: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో వాసవీ మాత జయంత్యుత్సవాలు బుధవారం భారీ అన్న సమారాధనతో ముగిశాయి. ఆదివారం ప్రారంభమైన ఈ జయంత్యుత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సామూహిక లక్ష మల్లెల పూజ, 18 రకాల ద్రవ్యాలతో అమ్మవారికి అభిషేకాలు, 51 రకాల హారతులతో పూజాదికాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నైవేద్యం సమర్పించి వాసవి ప్రార్థన మందిరంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా, మురళీకృష్ణ, రాజా, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు లక్ష్మీతాయారు, కార్యదర్శి మామిడి సావిత్రి తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ



బంటుమిల్లి: బండ్లగూడెం శివారు వశిష్ఠపాలెంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్మించిన నూతన రామాలయంలో సీతా, లక్ష్మణ, హనుమత్ సమేత సత్యకోదండ రాముల వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. పండితులు రుద్రపాక అగస్త్యకుమార్‌శర్మ శిష్య బృందం వేద మంత్రాల మధ్య మూడు రోజులుగా ప్రత్యేక హోమాలు, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. నూతన విగ్రహాలను శేరుకుంట పాలెంకు చెందిన పొట్లూరి స్వరాజ్యలక్ష్మీ, గ్రానైటును వెలివెల సత్యనారాయణ, టైల్స్‌ను పూర బాబు బహూకరించారని కమిటీ సభ్యులు ఎస్. సూర్యారావు, కె. అభిమన్యుడు, కె. లక్ష్మీనారాయణ, కె. నాగరాజు, వి. గంగాధర్, కె. కృష్ణ, ఆర్. భీమేశ్వరరావు తెలిపారు.

క్రిస్టియన్ ఫెడరేషన్ ఏపీ మహిళా అధ్యక్షురాలిగా సుకన్యపాల్



నాగాయలంక: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలిగా నాగాయలంక మండలానికి చెందిన బడుగు సుకన్యపాల్ నియమితులయ్యారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.విజయరాజు, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏజే శామ్యూల్, ఏపీ స్టేట్ అధ్యక్షుడు వి.సురేంద్రబాబు చేతులమీదుగా ఆమె నియామక పత్రం అందుకున్నారు. మండలంలోని టి.కొత్తపాలెం శివారు డేగలవారిపాలెంలో నెహేమియా మినిస్ట్రీస్ డైరెక్టర్‌గా ఆమె చర్చి నిర్వహిస్తున్నారు. అనాథ బాలల పాఠశాల నిర్వహణతో పాటు పలు సామాజిక సేవలను ఆమె తమ మినిస్ట్రీస్ ద్వారా కొనసాగిస్తున్నారు. తనను రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించిన ఏఐసీఎఫ్ నాయకులకు సుకన్య కృతజ్ఞతలు తెలిపారు.

కుండపోత వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

పెడన: పెడనలో బుధవారం ఉదయం కుండపోతగా వర్షం కురిసింది. ఉదయం నుంచి మబ్బుగా ఉంటూ వాతావరణం చల్లబడి ఆహ్లాదపరిచింది. అరగంట పాటు కుండపోతగా వర్షం కురవడంతో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అంతర్గత రోడ్లతో పాటు కచ్చా డ్రెయిన్లలో మురుగునీరు రోడ్లపైకి చేరింది. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు వర్షం నీటిని డ్రెయిన్లలోకి పంపించే పనుల్లో నిమగ్నమయ్యారు. చిన్నపాటి చిరుజల్లులు పడుతూనే ఉండటంతో ప్రజలు, చిరు వ్యాపారస్తులు ఇబ్బందులకు గురయ్యారు.

మూడు రోజుల్లో 40 కొత్త అడ్మిషన్ల నమోదు



అడ్మిషన్ పత్రాన్ని తల్లిదండ్రులకు అందిస్తున్న ఎంఈఓ రామదాసు

- 'మనబడి' పేరుతో విద్యాశాఖ ప్రచారం
- ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్చేందుకు ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు

కోడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ఇళ్లబాట పట్టారు. 'మనబడి' పేరుతో కోడూరు విద్యాశాఖ పిల్లలను ఆకర్షించేలా మండలంలో ప్రత్యేక ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, ఇంగ్లిష్ మీడియం బోధన తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరిస్తూ ఉపాధ్యాయులు ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటి వద్ద ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులు స్వాగతం పలుకుతూ తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్చేందుకు అడ్మిషన్ పత్రాలు నింపుతున్నారు. కోడూరు మండలంలోని స్వతంత్రపురం, ముందడుగు, ఇరాలి, ఊటగుండం, ఉల్లిపాలెం గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఎంఈఓ టీవీఎం రామదాసు పర్యవేక్షణలో ఉపాధ్యాయులు రాంబాబు, చందు, మోహన్, సాంబశివరావు, యడం శ్రీను, నాగరాజు, రాజేష్, జగదీష్‌లు పాఠశాల పరిధిలో ప్రచారం నిర్వహించి, మూడు రోజుల్లో 40 కొత్త అడ్మిషన్లు నమోదు చేశారు. ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతున్నారని ఎంఈఓ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దడంతో ప్రభుత్వ బడులకు ఆదరణ పెరుగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులు, తల్లులకు అందిస్తున్న పథకాలే ఈ ఆదరణకు కారణమని ఎంఈఓ చెప్పారు. విద్యా కోర్ కమిటీ సభ్యులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

97.68 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరంలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారానికి 97.68 శాతం పూర్తయింది. నగరంలో మొత్తం 18,588 పింఛన్లు ఉండగా వీటిలో 18,156 పింఛన్లను సాయంత్రం ఆరు గంటల వరకు అందించారు. పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగరం జిల్లాలో తృతీయస్థానంలో నిలిచింది. వేగంగా పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లను కమిషనర్ జి. చంద్రయ్య అభినందించారు.

విజయవాడ వెళ్లి పింఛను సొమ్ము అందజేత

నగరంలోని 28వ డివిజన్‌కు చెందిన సబ్బినేని రామ్మోహనరావు కాలికి గాయం కావడంతో విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొంది బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఆయనకు 28వ డివిజన్ సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ బాబూరావు విజయవాడ వెళ్లి పింఛను సొమ్మును బుధవారం అందజేశారు.



రామ్మోహనరావుకు పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ బాబూరావు

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రాస్తారోకో

మచిలీపట్నంటౌన్: కేంద్రంలో పాలన చేస్తున్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందని పలువురు సీఐటీయూ నాయకులు విమర్శించారు. సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు బుధవారం బుట్టాయిపేట సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అయినప్పటికీ బీజేపీ ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు కుట్ర పన్నుతోందని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్, పట్టణ పౌర సంక్షేమ సంఘం, మహిళా సంఘాల నాయకులు కొడాలి శర్మ, సీహెచ్ రాజేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, కేవీ గోపాలరావు, బూర సుబ్రహ్మణ్యం, రామారావు, విజయలక్ష్మీ, భవానీ, సుజాత, అరుణ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న నాయకులు

రామాలయానికి గ్రానైట్ సమర్పణ



బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు లక్ష్మీనారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న కోదండ రామాలయానికి ఎంపీపీ వెలివెల చినబాబు కుటుంబ సభ్యులు గ్రానైట్‌ను బహూకరించారు. సుమారు రూ. 4 లక్షల విలువ చేసే గ్రానైట్ బుధవారం ఆలయం వద్దకు చేరుకోగా ఎంపీపీ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కమిటీ సభ్యులకు అందజేశారు. బంటుమిల్లి పీఏసీఎస్ చైర్మన్ వెలివెల శివానంద్, వెలివెల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బలుసులమ్మ జాతర ప్రారంభం

బంటుమిల్లి: మల్లేశ్వరం గ్రామ దేవత బలుసులమ్మ జాతర ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఉత్సవాలను గ్రామ కమిటీ పర్యవేక్షణలో నిర్వహిస్తారు. ఈ నెల 7వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా తొలి రోజు అమ్మవారి ఘటాలను మేళతాళాలు, కనక తప్పెట్ల మధ్య గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పలు కుటుంబాల వారు ఉదయం బోనాలు సమర్పించి పూజలు చేశారు.

కనుల పండువగా గోకర్ణేశ్వరుడి రథోత్సవం

ముగిసిన స్వామివారి కల్యాణోత్సవాలు

కోడూరు: లింగారెడ్డిపాలెం గ్రామంలోని బాలా త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. కల్యాణమూర్తులకు విశేష పూజల అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగించారు. ఆలయం నుంచి గ్రామంలోని ఊరచెరువు వరకు గ్రామస్తులు రథాన్ని లాగి భక్తిభావం చాటుకున్నారు. ప్రతి ఇంటి వద్ద రథోత్సవానికి స్వాగతం పలుకుతూ మహిళలు నీటిని ఓరబోసి హారతులిచ్చారు. బుధవారం ఉదయం గోకర్ణేశ్వరుడి మూలమూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బిల్వార్చన, రుద్రాభిషేకాలను జరిపారు. మహాపూర్ణాహుతిని జరపగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రికి స్వామివారి, అమ్మవారికి పుష్పయాగం నిర్వహించారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకొని ఆలయం వద్ద సార్లగొంది గ్రామానికి చెందిన శ్రీరామ నాట్యమండలి, జైశ్రీ నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన పంచరత్నాల నాటకం విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ఈఓ సుధాకర్, జేఏ సీహెచ్ శివప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం తరఫున ఆలయ అధికారి తోట చెన్నకేశవులు స్వామివారు, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుడిని చేశారు. పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

శతాధిక వృద్ధురాలి మృతి

నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు



పొనమాల సోవమ్మ (ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని మూడో వార్డుకు చెందిన శతాధిక వృద్ధురాలు పొనమాల సోవమ్మ (102) బుధవారం మృతిచెందారు. ఆమె భర్త గతంలోనే మృతిచెందగా ఒక కుమారుడు, ఒక కుమార్తె, ముగ్గురు మనుమరాళ్లు, ముగ్గురు మనుమలు, ఆరుగురు ముని మనమళ్లు, ఆరుగురు ముని మనుమరాళ్లు ఉన్నారు. ఆమె నేత్రాలను కుమారుడు ఏసు, కుమార్తె కన్నా నాంచారమ్మ, మనుమడు నరసింహస్వామి విజయవాడలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సాయి బృందం మృతురాలి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు.

ఆలయ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఆస్థాన మండపం ప్రారంభం

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో వంశపారంపర్య ధర్మకర్తల సౌజన్యంతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన ఆస్థాన మండపాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ చారిత్రక గుర్తింపు పొందిన ఈ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే సింహాద్రి, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ప్రత్యేక పూజలు చేశారు. పోతరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత సంగీత శిక్షణ కార్యక్రమాన్ని ఈ కేంద్రంలో నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు తెలిపారు. పాలపర్తి ఆంజనేయులు శిక్షణ ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పి. సీతారామయ్య, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



ఆస్థాన మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు

పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

గుడివాడ టౌన్(నందివాడ): నవరత్నాల పథకాల అమలుపై సచివాలయ ఉద్యోగులు ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి కేఎస్ఎస్ సుబ్బారావు అన్నారు. నందివాడ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వీసెస్ ప్రజలకు అందడంలో జాప్యం తగదన్నారు. అప్పటికప్పుడే సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శులకు సూచించారు. సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సర్వే వేగవంతం చెయ్యాలని ప్రామాణికాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, అన్ని సచివాలయాల ఉద్యోగులు, ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ ..

నందివాడ మండలం పోలుకొండ గ్రామ సచివాలయంలో డీఎల్‌డీవో కేఎస్ఎస్ సుబ్బారావు ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. పథకాలు అమలుతీరుపై సమీక్షించారు. అన్ని శాఖల కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



రావివారిపాలెం(మోపిదేవి): రావివారిపాలెం పాల కేంద్రంలో పాల ఉత్పత్తిదారులకు బుధవారం రాత్రి బోనస్ పంపిణీ చేశారు. పాలకేంద్రం అధ్యక్షుడు రావి లక్ష్మణరావు మాట్లాడుతూ డిసెంబర్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు 4 నెలల కాలానికి పాల ఉత్పత్తిదారులు 118 మందికి గాను రూ. 1,81,750 పంపిణీ చేశామని వివరించారు. పాల కేంద్రం ఏరియా కో–ఆర్డినేటర్ మోర్ల వరప్రసాద్, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

డీఎఫ్‌సీఎస్ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయాలి

అవనిగడ్డ: మత్స్య సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని డీఎఫ్‌సీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు లకనం నాగాంజనేయులు కోరారు. స్థానిక ప్రాంతీయ మత్స్యశాఖ కార్యాలయం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి నెలలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకూ నిర్వహించలేదన్నారు. జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు.

13న మెగా లోక్ అదాలత్

గుడివాడ టౌన్: మెగాలోక్ అదాలత్ కార్యక్రమం ఈనెల 13వ తేదీన ఏర్పాటు చేశామని 11వ అదనపు జిల్లా జడ్జి (ఇన్‌చార్జ్) ఎస్. చిన్నబాబు తెలిపారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బుధవారం పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారానికి పోలీస్ అధికారులు కృషి చేయాలని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి ఎ. పూర్ణిమ, జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి పాల్గొన్నారు.

పాగోలులో రీ సర్వే ప్రారంభం

చల్లపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం ఫేజ్–2లో భాగంగా చల్లపల్లి మండలం పాగోలులో భూముల సమగ్ర రీ సర్వే బుధవారం ప్రారంభించారు. తహసీల్దార్ కె.గోపాలకృష్ణ మాట్లాడుతూ భూమి నిజ నిర్ధారణ, భూమి ధ్రువీకరణ చేస్తామని చెప్పారు. అనంతరం డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ తయారు చేస్తారన్నారు. రైతులు తమ భూమికి సంబంధించిన హక్కు పత్రాలు, పాస్ పుస్తకాలతో భూమిపై సర్వే సమయంలో హాజరై సహకరించాలని కోరారు. పాగోలు గ్రామంలో మూడు బృందాలతో సర్వే చేపట్టామని వివరించారు.



ఉపాధి పనుల పరిశీలన

నిమ్మకూరు(పామర్రు): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వహించాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల మస్టర్లను ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి పనులకు వచ్చిన వారికి మాత్రమే హాజరు వేయాలని రాని వారికి హాజరు వేస్తే వారిపై తగు విధమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంట బోదె పూడిక తీత పనులను నాణ్యంగా రైతులకు ఏవిధమైన ఇబ్బందుల లేకుండా చేయాలని అన్నారు. బోదుల ద్వారా సాగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా తవ్వకాలు జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పొలురాజు, ఫీల్డు అసిస్టెంట్ ప్రసాద్, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రేపు గురవమ్మ జాతర మహోత్సవం



ఉత్తరచిరువోలులంక (మోపిదేవి): ఉత్తర చిరువోలులంక గ్రామంలోని గురవమ్మ జాతర మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహిస్తామని సర్పంచ్ చింతా శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ నడకుదుటి గోవిందరావు తెలిపారు. ఆలయానికి వేస్తున్న రంగులను బుధవారం వారు పరిశీలించి మాట్లాడారు. వార్షిక జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు తీర్చుకోవాలని సూచించారు. నడకుదుటి పున్నయ్యశాస్త్రులు, నడకుదుటి రాము ఏర్పాట్లను పర్యవేక్షించారు.

10లోగా పెన్షన్‌దారులు ఈకేవైసీ పూర్తి చేయాలి

అవనిగడ్డ: ప్రభుత్వ పెన్షన్ దారులు ఈనెల 10వ తేదీ లోగా విధిగా ఈకేవైసీ పూర్తి చేయాలని స్థానిక ఉప ఖజానాధికారి పి. ఆదిశేషు తెలిపారు. స్థానిక ఎస్‌టీఓ పరిధిలోని నాలుగు మండలాల పెన్షన్‌దారులు కార్యాలయానికి వచ్చి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.